ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


నరసాపురం: గడ్డిబజార్‌లో ఆకట్టుకున్న విశేష అలంకరణ


పెనుగొండ: జవ్వాది వారి రామాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


పాలకొల్లు అర్బన్: 29వ వార్డులో యూత్ కమిటీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి


పాలకొల్లు సెంట్రల్: వెండి చీర అలంకరణలో ముఖధారమ్మతల్లి

- గ్రామాల్లో పండుగ సందడి
- ఆకట్టుకున్న ఏనుగుల సంబరం

నరసాపురం: విజయదశమి పర్వదినం పూజలు సోమవారం పట్టణంలోని అన్ని అమ్మవార్ల ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. గడ్డిబజార్‌లోని ప్రసిద్ధ కనకదుర్గ ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. పాతబజార్ వలవల వారి వీధిలో భద్రాద్రి రామసాయి మందిర్‌లో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వలవల విజయ్ దంపతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాయిపేట పుంతలోముసలమ్మ అమ్మవారి అలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరించారు. స్టీమర్‌రోడ్డు పండ్ల మార్కెట్ వద్ద ఉత్సవాలు ముగిశాయి. శ్రీ రాజరాజేశ్వరి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చాలా ఆలయాల్లో మంగళవారం కూడా దసరా పూజలు నిర్వహించారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: దేవిశరన్నరాత్రులు సందర్భంగా స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారిని మహిషాసురమర్దని, రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు అమ్మవారికి కుంభం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు దంపతులు అమ్మవారికి కుంభం ఏర్పాటు చేశారు. అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున ఉన్న శ్రీ ముఖధారమ్మ ఆలయంలో అమ్మవారిని వెండి చీరలో అలంకరించారు.

పాలకొల్లు మండలంలో..

పాలకొల్లు అర్బన్: పట్టణం, రూరల్ ప్రాంతాల్లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గత వారం రోజుల నుంచి ఘనంగా జరిగాయి. మంగళవారం పట్టణంలోని 29వ వార్డు లక్ష్మీ దుర్గ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో 34వ వార్షికోత్సవాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అమ్మవారి పీఠాన్ని దర్శించుకుని యూత్ కమిటీని అభినందించారు. అలాగే పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు – మాజీ కౌన్సిలర్ ఉమాశైలజ దంపతులను కమిటీ సభ్యులు సత్కరించారు. అలాగే సలాధి వారి తోటలో గల అమ్మవారి పీఠాన్ని దర్శించుకుని కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ అధ్యక్షుడు గొర్రెల రాజేష్, సభ్యులు వలిరెడ్డి రంగారావు, వరహాలు, సుబ్బారావు, ఏసుబాబు, వైసీపీ నాయకులు నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, ఇజ్జాడ చినబాబు, శంకరావు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దసరా సంబరాలు

పెనుగొండ: శరన్నవరాత్రి ముగింపు విజయదశమి నాడు పెనుగొండలో ఏనుగుల సంబరాలు అంబరాన్ని అంటాయి. విజయదశమి వేడుకలకు పెనుగొండ రెండో మైసూరుగా పేర్గాంచింది. సోమవారం పెనుగొండలో పలు వీధుల్లో సంఘాల ఆధ్వర్యంలో ఏనుగులను తయారు చేసి వాటిపై అంబారి తో అలంకరించి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత జమ్మి చెట్ల వద్ద శమీ పూజలు నిర్వహించారు.ఏనుగు అంబారీలతో పాటు వేంకటేశ్వర స్వామి దశవతారాలు, కనకదుర్గమ్మ అవతారాలు, హనుమద్ గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి విజయ దశమి వేడుకలు తిలకించడానికి భారీగా తరలి రావడంతో ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సిద్ధాంతంలో

సిద్ధాంతంలో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బస్టాండులోని కనకదుర్గమ్మ అమ్మవారిని భవానీ మాలధారులు, ఆలయ కమిటీ నిర్వాహకులు మేళతాళాలు, అమ్మవారి నృత్య రూపకాలతో పురవీధుల్లో నిర్వహించి వశిష్టాగోదావరిలో కనకదుర్గమ్మ ప్రతిమను నిమజ్జనం చేశారు. కోలాట భజనలు, మంచులింగాకృతిలు ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

ఆచంటలో

శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించి గోదావరిలో ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి గోదావరి రేవుల వరకూ తీన్మార్ వాయిద్యాలు, డీజే సౌండ్స్‌తో హోరెత్తించారు. ఆచంటేశ్వరుని సన్నిధిలో పార్వతి అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ గర్భగుడికి చేర్చారు.

పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలు

పెనుగొండ: పండుగలు సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శరన్నవ రాత్రులు సందర్భంగాసోమవారం రాత్రి జవ్వాది వారి రామాలయంలో నిలబెట్టిన భవానీ మాతను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం పల్లపువీధిలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్య నాయుడు(నానాజీ), ఎంపీపీ పూలినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), విద్యా వసతుల కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణు మాధవ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి, నాయకులు పోడూరి రామయ్య, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, గాజుల బులి పుల్లారావు, పోడూరి అప్పాజీ, అల్లం భాస్కర రెడ్డి, తాతాజీ బొండాడ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.


పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని అనేక గ్రామాలలో దసరా ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వివిధ ఆలయాలలో అమ్మవార్లను మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నత్తారామేశ్వరం గ్రామంలో విజయదుర్గా ఆలయం వద్ద భవానీ మాలధారుల ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పోతంశెట్టి భాస్కరరెడ్డి గురు భవానీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నెగ్గిపూడి గ్రామంలో శ్రీవనములమ్మ, శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలలో వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి పర్యవేక్షణలో నవరాత్రి మహోత్సవాలు జరిగాయి. మంగళవారం అమ్మవారి లడ్డూను వేలం వేయగా రూ. 10 వేలకు అల్లం శ్రీనివాసరెడ్డి, ధనలక్ష్మీదంపతులు దక్కించుకున్నారు. ఆలయం వద్ద పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి వేణుబాబు దంపతులను మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలతో ఏర్పాటు చేయడంతోపాటు రామాలయాల వద్ద కూడా కోలాట భజనలు చేస్తారు. ఈ విధంగా మేడపాడులో రామాలయాల వద్ద గత తొమ్మిది రోజులుగా కోలాట భజన చేశారు. దసరా సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక మంచినీటి చెరువుగట్టున శమీ పూజా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అనాదిగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా మంగళవారం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి చిత్ర పటాన్ని పూజా మందిరంలో ఉంచి, ఆ మందిరాన్ని ఏనుగు అంబారీపై పెట్టి ట్రాక్టర్ మీద గ్రామంలో ఊరేగించారు.


పెనుగొండ: సిద్ధాంతంలో ఐస్‌తో తీర్చిదిద్దిన మంచు శివలింగం


పెనుగొండ: వాసవీ శాంతి ధాంలో అమ్మవారికి పంచహారతులు ఇస్తున్న అర్చకుడు


పెనుమంట్ర: నత్తారామేశ్వరంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


యలమంచిలి: మేడపాడులో ఏనుగు అంబారీపై ఊరేగుతున్న సీతారాములు


పెనుగొండ: ఏనుగుల సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

పాలకొల్లు అర్బన్: మండలంలోని యాళ్లవానిగరువు గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శిబిరాన్ని సందర్శిస్తారని వివరించారు.

కనకాయలంకలో

యలమంచిలి: కనకాయలంక, పెదలంక గ్రామాలకు సంబంధించి కనకాయలంక గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మొక్కు తీర్చుకున్న సీఎం జగన్ అభిమాని


నత్తారామేశ్వరంలో శూలాలు ధరించి రథం లాగుతున్న తమనంపూడి నాగిరెడ్డి

పెనుమంట్ర: నత్తారామేశ్వరంలో శ్రీవిజయ దుర్గ ఆలయం వద్దసోమవారం పలువురు భవానీ భక్తులు శూలాలు సంబరం నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ ఏటా భవానీ భక్తులు తమ కోరికలు ఫలిస్తే అమ్మవారికి శూలాల సంబరం నిర్వహిస్తామని మొక్కుకుంటారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్పరెడ్డి సోదరుడు తమనంపూడి నాగిరెడ్డి జగనన్న ఐదేళ్లు పూర్తిగా కొనసాగాలని కోరుకున్న మొక్కును సోమవారం శూలం ధరించి రథం లాగడం ద్వారా తీర్చుకున్నాడు. కార్యక్రమాన్ని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ప్రారంభించారు.

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన


కొత్తపేటలో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: జలజీవన్ మిషన్‌లో మంజూరైన రూ.24లక్షల విలువైన పనులకు సర్పంచ్ కవురు భారతి శంకుస్థాపన చేశారు. మండలంలోని కొత్తపేట పంచాయతీలో మంగళవారం పైపులైన్ విస్తరణ, సంపు, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు సర్పంచ్ భారతి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకుడు కవురు భాస్కరబాబు, ఏఈ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ బల్క్‌మిల్క్ సెంటర్లు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి పరిశ్రమ రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ బల్క్ మిల్క్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. సోమవారం రాజామిల్క్ సెంటర్ కొప్పర్రులో ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాలశీతలీకరణ కేంద్రాలను ప్రోత్సహిస్తూనే ప్రభుత్వ రంగంలో కూడా వీటిని అందుబాటులోకి తెస్తుందని ఆయన అన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంతో పాటు పాల విక్రయానికి ఇబ్బందిలేకుండా పాడి రైతులకోసం ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరిస్తుందన్నారు. కొప్పర్రులో అతి త్వరలోనే పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రభుత్వపరంగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ, వైద్యుడు చినమిల్లి సత్యనారాయణ, గుడివాడ ప్రభాకరరావు, సర్పంచ్ మేరీ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.


మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

పోలియోపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: పోలియో మహమ్మారిని నిర్మూలించడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహనరావు అన్నారు. మంగళవారం వరల్డ్ పోలియో డే సందర్భంగా పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో మాత్రమే పోలియో ఎనిమిది కేసులు బయటపడ్డాయన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, రోటరీ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, చందక రాము, ముత్యాల శ్రీనివాసరావు, పీర్‌సాహెబ్, కఠారి నాగేంద్రకుమార్, ముచ్చర్ల సంజయ్, కానూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కుట్టుతో భవితకు మెట్టు

క్షీరపురిలో కుమారుడి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఎలాంటి ఆధారం లేని మహిళలతో పాటు ఆర్థికంగా భర్తకు చేదోడువాదోడుగా ఉందామనుకునే మహిళలకు స్వయం ఉపాధి మార్గం చూపుతున్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పిస్తూ ఇంటి దగ్గరే కష్టపడాలనుకునే మహిళలకు స్వయం ఉపాధిని పెంచుకోవడంలో సాయం చేస్తున్నారు. పాలకొల్లులో శ్రీ రాఘవేంద్ర ట్రస్ట్ మహిళలకు అందిస్తున్న సేవల గురించి ఓ సారి తెలుసుకుందాం.

– పాలకొల్లు అర్బన్

- ఉచిత కుట్టు శిక్షణతో మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగు
- ఆదర్శంగా నిలుస్తున్న శ్రీ రాఘవేంద్ర ట్రస్ట్ సేవలు

పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల గ్రామానికి చెందిన శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నిమ్మల అనంత రామారావు – కృష్ణవేణి దంపతులు పేదలకు విద్య, వైద్య, ఇతర సామాజిక అవసరాలు తీరుస్తూ ఆ సేవల్లో తమ బిడ్డను చూసుకుంటున్నారు. నిమ్మల అనంతరామారావు ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పలువురు ఐఏఎస్‌ల వద్ద ఓఎస్‌డీగా పనిచేశారు. వీరి కుమారుడు నిమ్మల రాఘవేంద్ర (రఘు) అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేస్తూ 2014లో అక్కడ నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మరణించారు. రాఘవేంద్ర పేరు మీద వచ్చిన రూ.1.30కోట్లు ఇన్సూరెన్స్ సొమ్ములను డిపాజిట్ చేసి 2015లో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా వీరు కరోనా సమయంలో చేసిన సేవలను పట్టణవాసులు స్వాగతించారు.

కుట్టు శిక్షణ ఇలా

శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. పాలకొల్లు పరిసర మండలాలకు చెందిన సుమారు 550 మంది మహిళలు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి దశలవారీగా 75 రోజుల పాటు శిక్షణ ఇచ్చి కుట్టు మెషీన్, మోటార్, మేజా బల్లతో సహా ఉచితంగా ఇవ్వడానికి ట్రస్ట్ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా మొదటి బ్యాచ్‌లో 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఉచితంగా కుట్టు మెషీన్, ప్రశంసాపత్రం అందజేశారు.


శిబిరంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు

ట్రస్ట్‌ను సందర్శించిన ఉన్నతాధికారులు...

గతంలో పీఆర్‌సీ చైర్మన్ అశుతోష్ మిశ్రా, సీనియర్ ఐఏఎస్ అధికారి సమీర్ శర్మ, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, మాజీ ఎంపీలు కనుమూరు బాపిరాజు, గంగరాజు తదితరులు సందర్శించి ట్రస్ట్ సేవలను అభినందించారు.

మహిళలకు ఎంతో ప్రయోజనం



ట్రస్ట్ ద్వారా మొదటి బ్యాచ్‌లో 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చాను. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిక్షణ కొనసాగుతోంది. ప్రతిఒక్కరూ చాలా ఇష్టంగా నేర్చుకుంటున్నారు. వీరికి మెషీన్‌పై శిక్షణ, క్లాత్ కత్తిరించడం, కాజాలు, ఉక్కులు వేయడం నేర్పుతున్నాం

– చల్లా గంగా భవాని, ట్రైనర్, భీమవరం

మగ్గం వర్కు కూడా నేర్పించాలి



కుట్టు శిక్షణ చాలా బాగా ఉపయోగపడింది. గతంలో నాకు కొంత వరకు వచ్చు. అయితే ప్రస్తుతం పూర్తిగా శిక్షణ పొందాను. బ్లౌజు కత్తిరించడం నేర్చుకున్నాను. ప్రస్తుతం మగ్గం వర్కుకి డిమాండ్ ఉంది. మగ్గం వర్కులో కూడా కొంత శిక్షణ ఇస్తే నాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– గన్నాబత్తుల సత్యకుమారి, శివదేవునిచిక్కాల

ట్రస్ట్‌కి రుణపడి ఉంటాం



నేను డిగ్రీ చదువుకున్నా. ప్రస్తుతం మా గ్రామంలో వాలంటీర్‌గా పనిచేస్తున్నా. మెషీన్‌పై కుట్టు శిక్షణలో చాలా నేర్చుకున్నా. నాలాంటి వరకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగం. భవిష్యత్తులో సొంతంగా షాపు పెట్టుకుని బ్లౌజులు, గౌన్లు కుట్టుకుని ఉపాధి పొందడానికి ఎంతో ఉపయోగ పడుతుంది. రాఘవేంద్ర ట్రస్ట్‌కి రుణ పడి ఉంటా.

– కందికట్ల ప్రసన్న, కాపవరం

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికులసమస్యల పరిష్కారం కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, ఆచంట, పెనుగొండ, యలమంచిలి పరసర ప్రాంతాల వారు ఆర్టీసీ సర్వీస్‌లు, కార్గో సర్వీస్‌లు, కార్గో సేవలు డోర్ డెలివరీలు తదితర అంశాలపై సమస్యలున్నా, ఎలాంటి సలహాలు, సూచనలు చేయాలనుకున్నా ఈ కార్యక్రమానికి ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని సూచించారు.

మావూరమ్మ ఆలయానికి ఏసీ అందజేత

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బంగారువారి చెరువు గట్టులో ఉన్న శ్రీ మావూరమ్మ ఆలయానికి మద్దుల వీర వెంకట సుబ్రహ్మణ్యం–స్వరూప దంపతులు రూ.42 వేలు విలువైన ఎయిర్ కూలర్ వితరణ చేశారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శంకరాపు శ్రీనివాసరావు, సభ్యులు రౌతు అచ్యుతరావు, యండం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్‌నే కోరుకుంటున్నారు

పెనుగొండ: రాష్ట్రంలో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. మంగళవారం ఆచంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆనందప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెట్టి సముపాళ్లలో పెట్టిన సీఎం జగన్‌కే ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మట్టా ఆనందకుమార్, నాయకులు వేదాల నాగరాజు, వడ్ల పాటి ఆనంద్ కుమార్, యడ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

పోడూరు: మండలంలోని జగన్నాథపురం శివారు పప్పుగుంట గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో దిద్దే నిర్మల ప్రభావతికి చెందిన పెంకుటిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ప్రభావతి రెండురోజుల కిందట కుమార్తె ఇంటికి వెళ్లడంతో ప్రమాద సమయంలో ఆమె ఇంట్లో లేదు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపుగా రూ.50 వేల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ గుడాల శిరీషవంటి, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు పరిశీలించారు.